క్లుప్తంగా

ఘనంగా రుషి పంచమి ఉత్సవాలు



నృత్యం చేస్తున్న మథుర సమాజ్ భక్తులు

ఇంద్రవెల్లి: మండలంలోని అందుతండా గ్రామంలో శుక్రవారం రుషి పంచమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కాలుబాబా, పాచుబాబా, జ్వాలముఖి ఆలయంలో మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రుషి పంచమి ఉత్సవాలకు పెద్ద ఎత్తున మథుర సమాజ్ భక్తులు హాజరై ఆలయంలో పూజలు చేసి రాంసింగ్‌బాబాను దర్శించుకున్నారు. మాజీ వైస్‌ఎంపీపీ మడ్వాల్ గోపాల్‌సింగ్, ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే

ఇచ్చోడ: మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో నృత్యాలు చేస్తూ అలరించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. విద్యార్థుల కేరింతలు, చప్పట్లతో కళాశాల మార్మోగింది. ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ రఘుగణపతి, లెక్చరర్లు కరుణాకర్, కోటయ్య, రేఖ, స్వప్న, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పెంచాలి

తాంసి: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల పింఛన్‌లను వెంటనే పెంచాలని ఎమ్మార్పీఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కప్పర్ల, పొన్నారి గ్రామాల్లో వృద్ధులు, దివ్యాంగులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పింఛన్‌లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత కంటి శస్త్రచికిత్సలు



కంటి పరీక్షలు చేయించుకున్న వృద్ధులతో రూపేష్ రెడ్డి

కై లాస్‌నగర్: యువజన కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి తన సొంత గ్రామం బేల మండలంలోని సాంగిడిలో ఇటీవల ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 15 మంది వృద్ధులకు శస్త్రచికిత్సలు అవసరం కాగా శుక్రవారం వారికి శస్త్రచికిత్సలు చేయించారు. దీంతో వృద్ధులు సామ రూపేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సామ నర్సారెడ్డి, వినోద్, దయాకర్ పటేల్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

కై లాస్‌నగర్: జిల్లాలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు నూతన భవనాలు నిర్మించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి గెడం కేశవ్ కోరారు. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శుక్రవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు దిలీప్, ఆనంద్, మాణిక్, ప్రవీణ్ ఉన్నారు.

‘ఆదర్శ’ హాస్టల్‌లోకి చొరబడ్డ ముగ్గురు యువకులు?

బోథ్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల హాస్టల్‌లోకి ముగ్గురు యువకులు రహస్యంగా చొరబడ్డ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం అర్ధరాత్రి సమయంలో హాస్టల్ ప్రహరీ దూకి, వెంటిలేటర్ ద్వారా గదిలోకి ప్రవేశించినట్లు తెలిసింది. ఈ వసతి గృహంలో వంద మంది వరకు ఇంటర్ విద్యార్థులున్నారు. స్థానికంగా గల కస్తూరిబా ఎస్‌వో వనిత దీనికి ఇన్‌చార్జిగా ఉన్నారు. కేర్‌టేకర్ (వార్డెన్)తో పాటు ఏఎన్‌ఎంలు ఇందులోనే ఉంటారు. ఓ గదిలో ఐదుగురు విద్యార్థినులు ఉండగా, అందులో ఓ విద్యార్థిని వద్ద సెల్‌ఫోన్ లభ్యమైంది. ఈ విషయంపై శుక్రవారం ఎస్‌వో, ప్రిన్సిపాల్ అనురాధ విచారించారు. రెండు రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో ముగ్గురు యువకులు వచ్చినట్లుగా తెలిసింది. వెంటనే విద్యార్థినుల తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించారు. ఓ విద్యార్థిని వద్ద సెల్‌ఫోన్ ఉండగా, అది తమది కాదని పేరెంట్స్ తెలిపారు. ఐదుగురు విద్యార్థినులను తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా, ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనాలు

- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు
- పట్టించుకోని అధికారులు



పెండల్‌వాడ గ్రామంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

సాత్నాల: గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్యను అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్నాయి. అయితే పలుచోట్లఅంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోవడంతో చిన్నారులతో పాటు అంగన్‌వాడీ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. 2018లో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.9 లక్షలతో జైనథ్ మండలంలోని మకోడా, పిప్పల్గావ్, కంఠ, ఆనంద్‌పూర్, భోరజ్ మండలంలోని గిమ్మ, కోరట, పెండల్వాడ, పూసయి, సాత్నాల మండలంలోని సుందరగిరి, మాంగుర్ల గ్రామాల్లో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. చాలా గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలు లేకపోవడంతో, అద్దె గదుల్లో చిన్నారులకు విద్యాబోధన కొనసాగిస్తున్నారు. భద్రత ప్రమాణాలు లేని ఈ తాత్కాలిక భవనాల్లోకి తల్లిదండ్రులు తమ చిన్నారులను పంపేందుకు వెనుకాడుతున్నారు.

పర్యవేక్షణ లోపం..

ప్రతీ సంవత్సరం బడ్జెట్ కేటాయింపులు ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల పనులు నిలిచిపోతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. చిన్నారుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసింది. అయితే భవనాలు పూర్తి కాకపోవడం వల్ల అసలు లక్ష్యం నెరవేరడం లేదు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని, అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాలను పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. నిధులు విడుదల చేసి, పనులు వేగవంతం చేస్తేనే సమస్య పరిష్కారమవుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చెట్ల కింద చదువులు..



అంగన్‌వాడీ భవన నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో పిల్లలు చెట్ల కింద చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు కల్పించుకొని భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి.

– ముక్కెర ప్రభాకర్, మాండగూడవాసి

అదనపు నిధులు కావాలి

గతంలో రూ.9 లక్షలతో నిర్మాణం చేపట్టిన అంగన్‌వాడీ భవనాలకు అదనంగా రూ.3 లక్షల నిధులు అవసరం. అదనపు నిధుల కోసం జిల్లా కలెక్టర్‌కు తెలియజేశాం. నిధులు విడుదలైన వెంటనే అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణం చేపడతాం.

– హరీశ్, పంచాయతీరాజ్ ఏఈ

ప్రతీ క్షణాన్ని శాశ్వతంగా నిలిపేది ఫొటోగ్రఫీ

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఫొటోట్రేడ్ హైదరాబాద్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: అద్భుత క్షణాలను శాశ్వతంగా నిలిపేది ఫొటో, వీడియోగ్రఫీ అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఫొటో ట్రేడ్ హైదరాబాద్ ఎక్స్‌పో పోస్టర్లను మండల కేంద్రంలోని ఆయన నివాసంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పుట్టిన రోజు, శుభకార్యాలు, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రతీ దానికి సాక్ష్యంగా ఫొటో, వీడియోలు నిలుస్తాయన్నారు. నాయకులు సంతోష్, ఆదిలాబాద్ జిల్లా ఫొటోగ్రాఫర్స్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలో శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై పురుషోత్తం చేతుల మీదుగా ప్రైవేట్ ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్స్ అసోషియన్ ఆధ్వర్యంలో ఎక్స్‌పో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ నెల 19, 20, 21వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఫొటో ట్రేడ్ నిర్వహణ సభకు పోస్టర్ విడుదల చేసినట్లు సభ్యులు తెలిపారు. మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ శిరీష్‌రెడ్డి, ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు దొడ అశోక్, ఉపాధ్యక్షులు ప్రవీణ్, సంయుక్త కార్యదర్శి విజయ్, మండల అధ్యక్షుడు మచ్చ అజయ్ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

నేరడిగొండ: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న ఎమ్మెల్యే కప్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన క్రీడాకారులకు శుక్రవారం సొంత డబ్బులతో బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. సాఫ్ట్‌బాల్ బాలికలు బుగ్గారం, బాలురలో నేరడిగొండ మొదటి బహుమతి సాధించారు. ప్రధానోపాధ్యాయులు పద్మ, సాఫ్ట్‌బాల్ సెక్రటరీ గంగాధర్, బుగ్గారం ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణవేణి, పీడీలు రమణ, అఖిల్, మమత, పీఈటీ గంగామణి, నాగరాజు, శ్యామ్, అనిల్, గణేశ్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

షీటీమ్ ఆధ్వర్యంలో అవగాహన

తలమడుగు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీ టీమ్ ఆధ్వర్యంలో ఏఎస్సై సుశీల చట్టాలపై అవగాహన కల్పించారు. సుశీల మాట్లాడుతూ మహిళలను ఇబ్బందులకు గురిచేసినా, వేధించినా టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలన్నారు. సైబర్ నేరాలపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. హెచ్‌ఎం వెంకట్‌రావు, ఉపాధ్యాయుడు వినోద్ రెడ్డి, మురళీధర్, సిబ్బంది మహేశ్, వాణి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సహకార రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

తాంసి: సహకార సంఘాల ద్వారా అందిస్తున్న వివిధ రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శుక్రవారం తాంసి ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో మహజన సభ సమావేశం నిర్వహించారు. సమావేశానికి డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి హాజరయ్యారు. సీఈవో కేశవ్ సహకార సంఘం ద్వారా చేపడుతున్న ఎరువుల విక్రయాలు, పంటల కొనుగోలుకు సంబంధించిన వివరాలను సభ్యుల ఎదుట చదివి వినిపించారు. చైర్మన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ సహకార సంఘాలలో దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న రుణాలను రైతులు చెల్లించి కొత్త రుణాలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉండే విధంగా మూడు గోదాంలను నిర్మించామన్నారు. వైస్‌చైర్మన్ ధనుంజయ్, డైరెక్టర్‌లు భూమారెడ్డి, బుజ్జన్న, రమేశ్, సంతోష్ రెడ్డి, అశోక్ రెడ్డి, చంద్రన్న, కార్యదర్శులు సుధాకర్, సిద్దార్థ్ రెడ్డి, ఇంతియాజ్, సచిన్ పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



మాట్లాడుతున్న అధికారి స్వామి

భీంపూర్: మండలంలోని గోముత్రి, ఆర్లి(టీ) గ్రామాల్లో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళ, శిశు వికలాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. బాలల పరిరక్షణ అధికారి స్వామి మాట్లాడుతూ.. బడీడు పిల్లలు చదువుకు దూరం కాకుండా చూడాలన్నారు. బాల్యవివాహాల నిర్మూలన, బాలలను లైంగిక వేధింపులకు గురైతే 1098 హెల్ప్ లైన్ నంబర్‌కు సమాచారం అందజేయాలన్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి బాలల సంరక్షణపై ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. సూపర్‌వైజర్ అనిల్, పంచాయతీ సెక్రటరీ వినోద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రీతం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ముంతాజ్, అంగన్‌వాడీ టీచర్ ఆశ, యువజన సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంపై గురి పెడితేనే నైపుణ్యం



కేడెట్లకు శిక్షణ ఇస్తున్న ఎన్‌సీసీ అధికారులు

ఆదిలాబాద్: ఎన్‌సీసీ కేడెట్లు లక్ష్యంపై గురి పెడితేనే ఫైరింగ్‌లో నైపుణ్యం పెరుగుతుందని ఎన్‌సీసీ సుబేదార్ రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని డీటీసీలో కొనసాగుతున్న ఎన్‌సీసీ 3వ వార్షిక శిక్షణ శిబిరం శుక్రవారంతో రెండోరోజుకు చేరుకుంది. శిక్షణలో భాగంగా తలమడుగు మండలం సుంకిడిలోని ఫైరింగ్ రేంజ్‌లో కేడెట్లకు ఫైరింగ్‌లో శిక్షణ అందించారు. ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవనాల నిర్మాణానికి కృషి



పుస్తకాలు అందజేస్తున్న దాతలు

ఆదిలాబాద్: పాఠకులు, నిరుద్యోగుల సౌకర్యార్థం గ్రంథాలయ భవనాల నిర్మాణానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నరసయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం మన పల్లె స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఔరంగాబాద్ ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు లైబ్రరీకి పోటీ పరీక్షల పుస్తకాలను ఉచితంగా అందించారు. పుస్తకాలను స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠకుల సమస్య పరిష్కారానికి ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తామన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో డైనింగ్ హాల్, టాయిలెట్స్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిరుద్యోగులు తమ లక్ష్యాన్ని సాధించే దిశగా శ్రద్ధతో చదువుకోవాలని సూచించారు. దాతలు ముందుకు వచ్చి రూ. 45 వేల విలువచేసే పోటీ పరీక్షల పుస్తకాలను అందించడం అభినందనీయమన్నారు. లైబ్రేరియన్ గౌరు శ్రీనివాస్, దాతలు ఎం.రాజేశ్వర్ రెడ్డి, నర్సింగ్ రెడ్డి, సత్యనారాయణ గౌడ్, మురళీధర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై కళాజాత బృందం అవగాహన



అవగాహన కల్పిస్తున్న బృందం సభ్యులు

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామంలో శుక్రవారం గ్రామస్తులకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై కళాబృందం సభ్యులు అవగాహన కల్పించారు. తెలంగాణ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై పొన్నారిలో అవగాహన కల్పించారు. ఎయిడ్స్ నియంత్రణ సభ్యులు నాగరాజు, భాగ్యలక్ష్మి, శశిమాల, అభిలాష్ రెడ్డి, కళాకారుల బృందం సభ్యులు దత్తు, ప్రేమ్ కుమార్, విలాస్, వెంకటేశ్ ఉన్నారు.

కాలినడకన వెళ్లి వైద్య సేవలు



నడిచి వెళ్తున్న వైద్య సిబ్బంది

భీంపూర్: మండలంలోని భగవాన్పూర్, మందపల్లి, కొజ్జన్గూడ, పాలోడి, గుంజాల, గుబిడిపల్లి గ్రామాల్లో పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం పర్యటించారు. రోడ్డు మార్గం సరిగా లేకపోవడంతో కాలినడకన వెళ్లి గ్రామాల్లో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఇండ్లను సందర్శించి ర్యాపిడ్ ఫీవర్ సర్వే, ఫ్రైడే, డ్రైడే వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్, తదితరులు తెలిపారు.

విధుల్లో చేరిన జీపీవోలు

ఇచ్చోడ: మండల తహసీల్దార్ కార్యాలయంలో నలుగురు జీపీవోలు విధుల్లో చేరినట్లు డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రమేశ్ తెలిపారు. అడేగామ కే క్లస్టర్ జీపీవోగా పురుషోత్తం, ఇచ్చోడ -1 క్లస్టర్ జీపీవోగా గాయక్‌వాడ్ ఆశతాయి, గేర్జం క్లస్టర్ జీపీవోగా జాదవ్ విజయ, తలమద్రి క్లస్టర్ జీపీవోగా దుర్వత బాయిలు శుక్రవారం విధుల్లో చేరినట్లు తెలిపారు.

తాంసి: జీపీవోలుగా మండలానికి కేటాయించిన నలుగురు జీపీవోలు శుక్రవారం విధుల్లో చేరారు. మండలంలోని హస్నాపూర్, గిరిగాం, కప్పర్లతో పాటు బండల్‌నాగాపూర్ క్లస్టర్‌లకు చెందిన జీపీవోలు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మికి రిపోర్ట్ చేశారు. జీపీవోలు సలీం, జాహ్నవి, సువర్ణ, భాగ్యలక్ష్మి కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

పోరాటాలతో సమస్యలు పరిష్కారం

ఇచ్చోడ: పోరాటాలతోనే కార్మికుల సమస్యల పరిష్కారమవుతాయని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య అన్నారు. శుక్రవారం ఇచ్చోడలో కార్మికులతో కలిసి మాట్లాడారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో కొన్ని మార్పులు చేసినట్లు తెలిపారు. కార్మికుల సాధారణ మరణానికి గతంలో రూ.30 వేలు ఇస్తుండగా ప్రస్తుతం రూ.2 లక్షలకు పెంచినట్లు తెలిపారు. భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బొద్దు రవి, బొజ్జ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ ప్రారంభం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆధార్ సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించినట్లు నిర్వాహకుడు కొండ హరిప్రసాద్ తెలిపారు. కొన్ని అనివార్య కారణాలతో గత నెల రోజుల నుంచి ఆధార్ సెంటర్‌ను మూసివేసినట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తిరిగి శుక్రవారం ప్రారంభించినట్లు తెలిపారు. ఆధార్ సెంటర్ సేవలను మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ఇంద్రవెల్లి: మండలంలోని దేవాపూర్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు కోవ సురేశ్‌ను శుక్రవారం గ్రామస్తులు, ఉపాధ్యాయులు శాలువాలతో సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికైన కోవ సురేశ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా తనదైన శైలిలో విద్యాబోధన చేయడంతో పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఉపాధ్యాయులు రాజ్ శ్రీనివాస్, అశోక్, సతీశ్, బొజ్జు, వినోద్, వెంకట్‌రావ్, గ్రామ పెద్దలు పెందోర్ మానిక్‌రావ్, కేంద్రే సంజీవ్, రాజేశ్వర్, తోడసం రాంచందర్, నగేశ్ తదితరులు ఉన్నారు.

ధర్నా విజయవంతం చేయాలి

ఉట్నూర్‌రూరల్: ఈ నెల 16న నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మెడికల్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంకంటి సుభాశ్ కోరారు. ఆసుపత్రి ఆవరణలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు, పరిశుద్ధ్య, పేషెంట్ కేర్ -సెక్యూరిటీ గార్డ్‌లు గత నాలుగు, ఐదు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యోగులు అందరూ కలిసికట్టుగా ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

త్వరలో అందుబాటులోకి తెలంగాణ సీడ్స్

బోథ్: బోథ్, సొనాల, బజార్‌హత్నూర్, నేరడిగొండ మండలాల రైతులకు 15 రోజుల్లో తెలంగాణ శనగ విత్తనాలు అందుబాటులోకి రానున్నాయని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి తెలిపారు. రైతులు సమయానికి విత్తనాలను సద్వినియోగం చేసుకుని సాగు ప్రారంభించాలని సూచించారు. ఈ సందర్భంగా సీడ్స్ డీలర్లతో శుక్రవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

నేరడిగొండ: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని తేజాపూర్ గ్రామానికి చెందిన షేక్ హకీమ్‌కు రూ.17,500, రోల్‌మామడ గ్రామానికి చెందిన ఆత్రం కామినిబాయికు రూ.30వేల విలువగల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు.

శ్రీసంత్ రామారావు మహరాజ్ విగ్రహం ఏర్పాటు చేస్తాం

బోథ్: సొనాల మండల కేంద్రంలో బంజారా ఆరాధ్య దేవుడు శ్రీ సంత్ రామారావు మహరాజ్ విగ్రహం ఏర్పాటు చేస్తామని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సొనాల మండల కేంద్రంలో బంజారా సంఘ పెద్దలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విగ్రహం ప్రతిష్ఠాపన చేస్తామన్నారు.

‘బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లోకి వెళ్లలేదు’

బోథ్: బోథ్ పట్టణం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ కూడా కాంగ్రెస్ పార్టీలో చేరలేదని పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 11వ తేదీన ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినట్లు కొంతమంది అసత్య ప్రచారం చేశారన్నారు.

‘విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తున్నాం’

బేల: మండలంలో ఎప్పటికప్పుడు విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని విద్యుత్ శాఖ కన్‌స్ట్రక్షన్ సీఈ, జిల్లా ఇన్‌చార్జి ఎస్ఈ జె.ఆర్ చౌహాన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల డోప్టాల, టాక్లీ, మశాల(బి) గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా గురువారం రాత్రి 10గంటలకే సరఫరాను పునరుద్ధరించామన్నారు. ప్రజలు సిబ్బందికి సహకరించాలని కోరారు. లైన్ ఇన్స్‌స్పెక్టర్, ఏఈలపై విచారణ చేసి, తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ జెడ్పీఎస్‌ఎస్ పాఠశాలలో నిర్వహించే ఆరోగ్య పాఠశాల కార్యక్రమానికి శుక్రవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును పాఠశాల హెచ్‌ఎం శీతల్ చౌహాన్ మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఉన్నతమైన భవిష్యత్తుపై ఆరోగ్యకరమైన అలవాట్లు అనే కార్యక్రమానికి ఎమ్మెల్యేను ఆహ్వానించామన్నారు.

20శాతం సీట్లు కేటాయించండి

నేరడిగొండ: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ నాయకులకు 20 శాతం సీట్లు కేటాయించాలని బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతరెడ్డి అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌కు యువ నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ కె.కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు పట్టణంలోని టీచర్స్ కాలనీ, సంజయ్‌నగర్, రిక్షా కాలనీ, పాత హౌజింగ్‌బోర్డు, కలెక్టర్, షాద్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాద బీమా డబ్బులు అందజేత

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రానికి చెందిన జాదవ్ ప్రకాశ్‌కు గత నెలలో ప్రమాదంలో కాలు విరిగింది. ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకోగా పోస్టల్‌లో బీమా కట్టడంతో బీమా డబ్బులను అధికారులు ప్రకాశ్ కుటుంబానికి అందించారు.

ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15, 16వ తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్ తెలిపారు. బీఎస్సీ లైఫ్ సైన్సెస్‌లో 05, బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 04, బీకాం (కంప్యూటర్)లో 17, బీకాం (బీఎఫ్‌ఎస్)లో 60 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

మిగిలిన సీట్ల భర్తీకి గడువు పొడిగింపు

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ ఐటీఐ, ఐటీసీ, ఆర్ ఐటీఐ, ప్రైవేట్ ఐటీఐలలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 30 వరకు గడువు పొడిగించినట్లు ఉట్నూర్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు స్థానిక కళాశాలకు హాజరై సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

‘సాక్షి’పై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

తలమడుగు: సాక్షి తెలుగు దినపత్రికపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యకు పాల్పడుతుందని, ఇది పత్రిక స్వేచ్ఛ హరించడమేనని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయిండ్ల మహేందర్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో విలేకారుల సమావేశం నిర్వహించారు.

ఐటీఐలో వాక్ఇన్ అడ్మిషన్లు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగిలిన సీట్లకు సంబంధించి వాక్ఇన్ అడ్మిషన్లకు ఈనెల 30 వరకు గడువు ఉందని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్నవారు కూడా ఈ వాక్ఇన్ అడ్మిషన్‌లో పాల్గొనవచ్చని తెలిపారు.

మహాత్మా జ్యోతిబాపులే గురుకులం తనిఖీ

బేల: మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపులే బీసీ బాలుర గురుకులం పాఠశాలను శుక్రవారం మండల ప్రత్యేక అధికారి మనోహర్ తనిఖీ చేశారు. వంట గది, పరిసరాలను పరిశీలించారు. నెలకొన్న సమస్యలపై ప్రిన్సిపాల్ రంగన్నను అడిగి తెలుసుకున్నారు.

పేదల సమస్యలు తీర్చండి

ఉట్నూర్‌రూరల్: మారుమూల గ్రామాల్లో, పట్టణ కాలనీల్లో నివసిస్తున్న పేదల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు భరత్ చౌహాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీలో పర్యటించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నాల్గవ తరగతి ఉద్యోగుల నూతన కార్యవర్గం

ఆదిలాబాద్‌టౌన్: నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఇటీవల ఎన్నుకున్నారు. శుక్రవారం ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో వివరాలను వెల్లడించారు. అధ్యక్షుడిగా ఎస్.నర్సింగ్, సహఅధ్యక్షుడిగా దిగంబర్, ఉపాధ్యక్షులుగా శంకర్, శ్రీనివాస్, కార్యదర్శిగా ఆశన్న, సంయుక్త కార్యదర్శులుగా మహ్మద్ జాకిర్, గంగమ్మ, కోశాధికారిగా ఆర్.మహేశ్వర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా బి.సునీల్, ప్రచార కార్యదర్శిగా శాత్వారాం, కార్యాలయ కార్యదర్శిగా దేవిదాస్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి



మాట్లాడుతున్న సమీరుల్లా ఖాన్

ఆదిలాబాద్‌టౌన్: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సీడబ్ల్యూసీ కమిటీ సభ్యుడు సమీరుల్లా ఖాన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఈద్గా మైదానంలో షూర్ ఎన్జీఓ సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ వరల్డ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగడంతో ఆడపిల్లలు మానసికంగా, శారీరకంగా అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు.